

# హైదరాబాద్ వార్త

## అంగరంగవైభవంగా విశాల్‌దీవాన్ ఉత్సవాలు

**ప్రభాతవార్త,అబిడ్స్ ప్రతినిధి:** సిక్కుల మత గురువు గురునానక్‌దేవ్‌జీ 555 జయంతోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో ఏర్పాటు చేసిన విశాల్‌దీవాన్ ఉత్సవాలు అంగరంగవైభవంగా నిర్వహించారు. విశాల దీవాన్ ఉత్సవాలకు నగరంనుంచే కాకుండా ఇతర జిల్లాలనుంచి పెద్ద ఎత్తున్న సిక్కులు కుటుంబసమేతంగా తరలివచ్చారు. గురునానక్‌జయంతి ఉత్సవ విశాల్ దీవాన్‌లో గుర్బానీకీర్తనలను భక్తి శ్రద్దలతో ఆలపించారు. రంగురంగుల పూవ్వులతో అలంకరించినబడిన ప్రధాన వేధికపై సిక్కుల పవిత్ర గ్రంథం ఏర్పాటు చేశారు. పంజాబ్ గోల్డెన్ టెంపుల్‌కు చెందిన బాయ్ లాక్‌వేదంర్‌సింగ్, బాయ్ అమ్రీత్‌సింగ్‌జీ, బాయ్ చరణ్‌జిత్‌సింగ్, జగ్‌దేవ్‌సింగ్, హర్వింధర్‌సింగ్ నగర కీర్తనలు ఆలపించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఇతర రాష్ట్రాల నుంచి తరలి వచ్చిన సిక్కులు పవిత్ర గ్రంథంను దర్శించుకున్నారు. ప్రభంధక్‌కమిటి ప్రతినిధులు ఎస్. బల్‌దేవ్‌సింగ్ బగ్గా, సత్యవేందర్‌సింగ్, జప్పాల్‌సింగ్, జోగేందర్‌సింగ్ ముఝ్రాల్, ఎస్. జగన్‌మోహన్‌సింగ్, హరిప్రీత్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు. కాగా గ్రేటర్‌హైదరాబాద్ మహానగరపాలక సంస్థ మేయర్ గద్వాల విజయలక్ష్మి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు తరలి వచ్చి గురుగ్రంథ్ సాహెబ్ వద్ద ప్రత్యేక ప్రార్దనలు చేశారు.



గురుగ్రంథసాహెబ్‌ను దర్శించుకున్న సిక్కుమహిళలు

ఉచిత మెడికల్‌క్యాంపు...

గురునానక్‌దేవ్‌జీ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని నాంపల్లిమైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలోఉచిత వైద్యశిభిరం నిర్వహించారు. ఉత్స వాలకు విచ్చేసిన బిపి, షుగర్, రక్తపరీక్షలను నిర్వహించారు. తలసీమియా రోగులకు సిక్కు యువకులు రక్తదానం చేశారు. అంతేకాకుండా భక్తులకు అన్నదానం చేశారు.

# విద్యుత్తు కార్యాలయాల్లో ముడుపులిస్తేనే కదులుతున్న ఫైళ్ళు

### -అధికారుల లీలలు ఇష్టారాజ్యంగా వసూళ్ళు..

**హైదరాబాద్, నవంబర్ 15ప్రభాతవార్త:** టీజీ ఎస్పీడిసీఎల్ విద్యుత్ డీఇ, ఏడీఇ కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. చేయి తడిపితే కాని కొందరు అధికారులు పనులు చేయడం లేదనే విమర్శలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. తమ పనులు చేసి పెట్టాలని వెళ్ళిన వారికి డబ్బులు ఇవ్వకుంటే సదరు దస్త్రంలో లేనిపోని కారణాలు చూపిస్తూ కొందరు అధికారులు పెండింగ్‌లో పెట్టడం సర్వసాధారణంగా మారింది. ప్రతి పనికి ముందుగా అధికారులు వర్క్ ఎస్టిమేషన్లు వేయాలి. ఈ ఎస్టిమేషను వేసేటప్పుడే కొంత మంది అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఎస్టిమేషన్లు వేసే ముందు అడిగినంత ముడుపులు చెల్లిస్తే ఒక విధంగా డబ్బులివ్వకపోతే మరోలా ఎస్టిమేషన్లు వేస్తూ టీజీ ఎస్పీడీసీఎల్ ఆదాయానికి భారీగా గండికొడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాజేంద్రనగర్ ఎస్ఇ కార్యాలయం పరిధిలోని కందుకూరు, రాజేంద్రనగర్, షాద్‌నగర్ డీఇ కార్యాలయాలతో పాటు హబ్సీగూడ సర్కిల్ పరిధిలోని కీసర, హబ్సీగూడ డీఇ కార్యాలయాలు మేడ్చల్ సర్కిల్ పరిధిలోని మేడ్చల్, కూకట్‌పల్లి, జీడిమెట్ల డీఇ కార్యాలయాలు, అవినీతిమయంగా మారాయి. క్షేత్రస్థాయిలో ఉండే విద్యుత్ విభాగం అధికారులు కుమ్ముక్కై పెద్దఎత్తున అక్రమార్జనకు పాల్పడుతూ అక్రమాస్తులు కూడబెడుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)దృష్టి సారించడంలేదనే అభిప్రయాలు వ్యక్తం అవుతున్నాయి. వాణిజ్య (కమర్షియల్ ) నిర్మాణాలు, బహుళంతస్తుల భవనాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో కొత్త కనెక్షన్లకు అక్రమ వసూళ్ళు లక్షల్లో జరుగుతున్నట్లు సమాచారం. శివార్లలో వ్యక్తిగత గృహాలతోపాటు బహుళంతస్తుల భవనాలతోపాటు కమర్షియల్ భవనాలు, విల్లాలు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. పెద్దఎత్తున వెలుస్తున్న నిర్మాణాలు అధికారులకు కాసులు కురిపిస్తున్నాయి. కొత్త కనెక్షన్ కావాలన్నా, ఇంటి ముందు అదనపు విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలన్నా, కొత్త లైన్ వేయాలన్నా, అపార్ట్‌మెంట్‌లో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవాలన్నా పెద్ద మొత్తంలో లంచాలు ఇవ్వనిదే పనులు కావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్ల మంజూరుకు పెద్ద మొత్తంలో ముడుపులు తీసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. విద్యుత్ వ్యవస్థలో అనేక సంస్కరణలు తీసుకువచ్చినప్పటికీ ఈ కార్యాలయాల్లో ఏ మాత్రం మార్పులు రాక పోగా అవినీతి మాత్రం మరింత పెరిగిపోయిందని పలువురు పేర్కొంటున్నారు. వినియోగదారులను దోచుకోవడమే తమ విధి అన్నట్లుగా ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని బాహాటంగానే విమర్శలు వినిపిస్తున్నాయి. ఫైళ్ళ క్లియర్ కోసం డీఇ, ఏడీఇ ,ఏఇ కార్యాలయాల చుట్టూ తిరిగి అలిసిపోయిన వారు రాజీపడి విధిలేని పరిస్థితుల్లో ఎంతో కొంత ముట్టచెప్పి వారి పనులు చేయించుకోవాల్సిన పరిస్థితి కరెంట్ కార్యాలయాల్లో నెలకొంది. చేయి తడిపితే మాత్రం అవసరమైన ధృవపత్రాలు ఉన్నా, లేకున్నా పనులు చక చకా చేసి పెడుతున్నారు. కొందరు డీఇలు, ఏడీఇలు, ఏఇలు బ్రోకర్లతోపాటు మధ్యవర్తుల ద్వారా తమ వసూళ్ళ పర్వాన్ని కొనసాగిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. విధి నిర్వహణలో కొందరు భారీగా అక్రమ ఆస్తులు సంపాదించారనే ఆరోపణలు ఉన్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్దఎత్తున జరుగుతుండడంతో అక్రమార్కుల పంట పడుతోంది. కొత్త విద్యుత్ కనెక్షన్లకు వర్క్ ఎస్టిమేషన్ నుంచి బహుళ అంతస్తులు ప్యానల్‌బోర్డులు, డీటీఆర్ మీటర్ల జారీలకు అందినంత దండుకుంటున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లలో సాంకేతిక సమస్యలు తలెత్తినా, ఫీడర్లు ట్రిప్పయినా క్షేత్రస్థాయిలోని కొందరు అధికారులు, సిబ్బంది స్పందించకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. విద్యుత్ సమస్యలు నెలకొంటే డీఇలు, ఏడీఇలు, ఎఇలు, లైన్‌మెన్లు పట్టించుకోవడంలేదు. కార్యాలయాలకు అధికారులు ఎప్పుడు వస్తునా న్రో ఎప్పుడు పోతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. వీరిపై ఉన్నతాధికారుల నిఘా కొరవడడంతో కార్యాలయాలను తమ స్వంత ఎస్టేట్‌ల్లా భావిస్తూ తమకు చిత్తం వచ్చినప్పుడు కార్యాలయాలకు వస్తూ, పోతుండడతో ఆయా పనుల కోసం వచ్చే వినియోగదారులు విసిగిపోతున్నారు. విద్యుత్ కనెక్షన్ల జారీలో ఉన్నటువంటి నిబంధనలు కొందరు అధికారులకు కాసుల వర్షం కురిపిస్తున్నాయి. విద్యుత్ ప్యానల్ బోర్డుల ఏర్పాటులో కొందరు అధికారులు, సిబ్బంది అనేక అక్రమాలకు పాల్పడుతున్నారు. చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్యానల్ బోర్డుల పేరు చెప్పి విద్యుత్ మీటర్ల జారీలో అందినంత దండుకుంటున్నారు. పరిమితికి మించితే కనెక్షన్లకు సంబంధించి ప్యానల్ బోర్డు ఏర్పాటు తప్పనిసరి అని పేర్కొంటున్న అధికారులు కొందరికి మాత్రమే ఈ నిబంధనల వర్తిపంచేయడం బట్టి చూస్తే కొందరు అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించంతో పాటు ఏ మేర అక్రమాలకు ప్పాలడుతున్నారో అర్థమవుతుంది.



ట్రాన్స్‌పార్మర్

# నగరానికి "మహా ప్రణాళిక "

### -హైదరాబాద్ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్
### -వరదనీరు మళ్ళింపే లక్ష్యంగా ప్రణాళికలు



**హైదరాబాద్, నవంబర్ 15, ప్రభాతవార్త:** అరగంట వర్షం పడితే చాలు హైదరాబాద్ మహా నగరం చెరువును తలపిస్తోంది. ఈ సమస్య ఒక్కసారి అయితే ఏదో అనుకోవచ్చు. కానీ ఎప్పుడు వర్షం పడినా ఇదే తీరు. వర్షపు నీటి సమస్య ప్రతి ఏడాది ఉత్పన్నమవుతూనే ఉంది. ఎక్కడికక్కడ జనజీవనం స్తంభించిపోయి, ట్రాఫిక్ కష్టాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు వరద ముప్పును ఎదుర్కొని బిక్కుబిక్కుమని గడుపుతూ ఉంటున్నారు. అయితే ఈ సమస్యకు పూర్తి పరిష్కారాన్ని కనుగొనేందుకు నగరపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కార్యాచరణ ప్రణాళికలను రూపొందిస్తోంది. వరద ముప్పు నుంచి హైదరాబాద్‌ను రక్షించేందుకు మహా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. ఈ ప్రణాళికలు 2050 నాటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని వివిధ అంశాలపై రూపొందిస్తున్నారు. అందులో కీలకమైనది వరద మళ్లింపు. ఈ ప్రణాళిక వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికల్లా సిద్ధం కానుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ అసమతౌల్యం కారణంగా వరదలు బీభత్సం సృష్టిస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఎన్నడూ లేని విధంగా ఉన్నట్లుండి ఒకేసారి కుండపోత వర్షం వచ్చి మీదపడుతోంది. ముఖ్యంగా ఈ తరహా వర్షాలతో నగరాల్లో జనజీవనం అస్తవ్యస్తం అవుతుంది. ఆస్తి నష్టం కూడా అపరిమితంగానే ఉంటోంది. ఇందుకు నిదర్శనం ఈ ఏడాదే సంభవించిన విజయవాడ వరద బీభత్సం. 2020లో కూడా హైదరాబాద్‌ను ఇలాంటి వరదే వణికించింది. ఇలాంటి పరిస్థితులు రాబోయే రోజుల్లో మరింతగా ఉండే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తూ, ఇందుకు తగిన ప్రణాళికలను నగరపాలక పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ సిద్ధం చేస్తోంది. 2050 నాటికి అవుటర్ రింగ్ రోడ్డు పరిధిలో అభివృద్ధి చెందే నగరం అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఈ ప్రణాళికలు రూపొందించింది. అందులో ప్రధానం వరద మళ్లింపు. హైదరాబాద్‌లో ఇప్పుడున్న నాలా వ్యవస్థ రోజుకి 8 సెంటీమీటర్ల వర్షాన్ని మాత్రమే తట్టుకోగలదు. కానీ 2020 అక్టోబరు నెలలో మాత్రం ఒక్కరోజే 19.2 సెంటీమీటర్ల వర్షం కురిసింది. దీంతో హైదరాబాద్ లోతట్టు ప్రాంతాలన్నీ పూర్తిగా జలమయం కాగా, రోజుల తరబడి జనాలు బురదలో బిక్కుబిక్కుమంటూ బతికారు. వరద నీరు నాలాల ద్వారా చెరువుల్లోకి.. అక్కడి నుంచి మూసీలోకి.. హైదరాబాద్ నగరంలో మూసీకి ఇరువైపులా 15 వరకూ చెరువులు ఉన్నాయి. నగరంలో కురిసే వరద నీరును ముందుగా ఈ చెరువుల్లోకి, అక్కడి నుంచి మూసీలోకి మళ్లించడం ద్వారా వరద ముప్పును ఎదుర్కోవచ్చనే ఆలోచన చేస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇప్పుడు హైదరాబాద్ లో ఎటుచూసినా చెరువులు కబ్జాకు గురయ్యాయి. ఉన్నవాటిల్లో పూడిక పేరుకుపోయింది. వరద నీరు చెరువుల్లోకి కలిసే నాలాలు పూడిపోయాయి. అందుకే చెరువుల ప్రస్తుత సామర్థం, వాటి పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలపైనా అధ్యయనం చేస్తున్నారు. అందులో భాగంగా చెరువులకు చేరిన నీరు మూసీలో కలిసేలా ప్రణాళికను చేస్తున్నారు. మూసీ సుందరీకరణ పథకానికి ఇది చాలా ఊతమిస్తుందని అధికారులు తెలుపుతున్నారు.

# ఆలయాల్లో కార్తీక శోభ



కార్తీక పౌర్ణమి సందర్భంగా బేగంపేట శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మి అమ్మ వారి ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించిన దృశ్యం.



మీరాలంమండి శ్రీ మహాంకాళేశ్వర మందిరంలో జరిగిన కార్తీక పౌర్ణమి మహోత్సవాలలో పాల్గొన్న భక్తులు

**బేగంపేట నవంబరు 15, ప్రభాతవార్త** కార్తీక పౌర్ణమి సందర్భంగా పూజలు నిర్వహించుకునేందుకు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివాలయాలతో పాటు అమ్మ వారి ఆలయాల్లో పౌర్ణమిని పురస్కరించుకొని చండీ హోమాలు నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే పౌర్ణమికి ఎంతో ప్రాధాన్యత ఉండటంతో భక్తులు వేకువ ఝామున తలార స్నానమాచరించి కార్తీక దీపాలు వెలిగించడంతో పాటు అమ్మ వారి ఆలయాల్లో నిర్వహించిన చండీ హోమంలో కుంటుంబ సభ్యులతో కల్సి పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈ ఓ ,ఫౌండర్ ఛైర్మన్ల ఆధ్వర్యంలో పటిష్టమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. బేగంపేట శ్రీకట్టమైసమ్మ మహాలక్ష్మీ అమ్మ వారి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వంగా అంబుజా, ఫౌండర్ ఛైర్మన్ చెక్కల సుభాష్ ముదిరాజ్ ల ఆధ్వర్యంలో చండీ హోమంలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టారు. చండీ హోమం సందర్భంగా ఆలయాన్ని వివిధ రకాలైన పూలతో అందంగా అలంకరించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు ప్రసాదాల వితరణ చేసారు. అనంతరం అన్నదానం చేసారు. సాయంత్రం ఆలయంలో ఓం, స్వస్తిక్‌తో పాటు వివిధ ఆకారాలలో కార్తీక దీపాలు వెలిగించారు. అమ్మ వారికి పూజలు నిర్వహించిన భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేసారు. ఈ హోమంలో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి పూజలు నిర్వహించారు. అందజేసారు.

### పాతబస్తీలో వైభవంగా కార్తీక పౌర్ణమి

**యాకుత్‌పుర, నవంబరు 15 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శుక్రవారం అత్యంత భక్తి శ్రద్దలతో కార్తీక పౌర్ణమి మహోత్సవాలను జరుపుకున్నారు. అలియాబాద్, ఘాన్సీబజార్, ఛత్రినాక, లాల్‌దర్వాజ, దూద్‌బౌలి, కిషన్‌బాగ్ పురానాపూల్ ప్రాంతాలలోని శివాలయాలలో భక్తులు పూజలు, అభిషేకాలు జరిపారు. కాగా కార్తీక పౌర్ణమి సందర్భంగా శుక్రవారం మీరాలం మండి శ్రీ మహాంకాళేశ్వర దేవాలయంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు మందిరం అధ్యక్షులు గాజుల అంజయ్య ఆధ్వర్యంలో కన్నుల పండవగా జరిగాయి. జంట నగరాలలోని పలు ప్రాంతాలకు చెందిన భక్తులు ఈ పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం అనంతరం భక్తులు శ్రీమహాంకాళేశ్వరి అమ్మ వారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. పాతబస్తీలోని అన్ని శివాలయాలు భక్తుల రద్దీతో కిక్కిరిసి పోయాయి.

## అప్పు చెల్లిస్తానంటూ సైబర్ మోసం..

### -బంజారాహిల్స్ పోలీసులను ఆశ్రయించిన యువతి..

**పంజగుట్ట, నవంబర్ 15 (ప్రభాతవార్త):** మీ తండ్రి దగ్గర అప్పుగా డబ్బులు తీసుకున్నాను, ఆ మనీ ఇద్దామంటే ఆయన ఫోన్ నంబర్ పోయింది. నీ నంబర్‌ను గతంలో ఫీడ్ చేసుకోవడం వలన నీకు ఫోన్ చేశాను అని తండ్రపేరుతో పాటు పూర్తి వివరాలు చెప్పడంతో ఎవరో తెలిసిన వారే అనుకుని పొరపాటును ఆగంతకుడు చెప్పినట్లు చేసిన యువతి మోసపోయిన సంఘటన బంజారాహిల్స్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్డునంబర్ 1 లో నివశించే స్వాగతారాయ్‌అనే యువతికి సైబర్ మోసగాడు ఫోన్‌చేసి మీ నానా అశోక్‌కుమార్‌కు బాకీ ఉన్నానని వాటిని నీకు గూగుల్‌పే చేస్తానని చెప్పాడు. తన పేరు, తన తండ్రిపేరు ఖచ్చితంగా చెబుతుండడంతో ఆమె అతనిని నమ్మింది. వెంటనే మోసగాడు, 10, వేలు ఒకసారి, 20 వేలు ఒకసారి ఆ యువతి ఖాతాకు మళ్ళించి మెసేజ్ చెక్ చేసుకోమన్నాడు. ఆ మేరకు మెసేజ్ కూడా వచ్చింది. మరికొద్ది సేపటికే మరో 12 వేలు పంపించాడు. మళ్ళీ ఫోన్ చేసి మెసేజ్ వచ్చిందా అని అడిగి పొరపాటున 40 వేలు పంపించాను, రెండు వేలు ఉంచుకుని మిగతా 38 వేలు తన ఖాతాకు పంపమని అడిగాడు. ఇంత నమ్మకంగా చెబుతుండడంతో ఆమె నమ్మి డబ్బులు మోసగాడి ఖాతాకు బదిలీ చేసింది. తర్వాత చూసుకోవడంతో 38 వేలు పంపిన తర్వాత ఆమె ఖాతాలో ఉన్న నగదు మొత్తం ఖాళీగా కనిపించింది. వెంటనే భర్తకు చెప్పడంతో తాము మోసపోయామని గ్రహించి వెంటనే బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి, ఆ యువతి సైబర్ మోసానికి గురైందని భావించి, నేరగాడి ఖాతాను వెంటనే ఫ్రీజ్ చేశారు. అయితే బాధితురాలు సకాలంలో స్పందించడంతో నేరగాడి ఆచూకీ తెలుసుకోవడం పెద్ద కష్టం కాదని బంజారాహిల్స్ పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంబభించారు.

## స్నేహితుడి పుట్టిన రోజుకు వచ్చి యువకుడి దారుణ హత్య

### - పథకం ప్రకారమే పిలిపించి పదునైన ఆయుధంతో దాడి?

**నార్సింగి, నవంబర్ 15 ప్రభాతవార్త :** స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకని వచ్చిన యువకుడు స్నేహితుల దాడితో తీవ్రంగా గాయపడి దుర్మరణం చెందాడు. ఈ విషాదకర సంఘటన నార్సింగి పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... హైదరాబాద్‌లోని ఐడీపీఎల్ బాలానగర్ ప్రాంతానికి చెందిన రోహిత్ కుమార్ సింగ్(25) గురువారం రాత్రి తన స్నేహితుడైన అక్బర్ పుట్టిన రోజు ఉందని ఇంట్లో చెప్పి గండిపేట మండలం మణికొండ అల్కాపూర్ ప్రాంతానికి వచ్చాడు. అక్కడ స్నేహితులతో కలిసి పార్టీ చేసుకున్నాడు. ఇంతలోనే ఒకరు రోహిత్ తలపై బలమైన ఆయుధంగా దాడి చేయడంతో తీవ్ర రక్తగాయాలపాలయ్యాడు. కొంత సమయానికి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. రోహిత్ చనిపోయాడని భావించి అక్కడి నుంచి స్నేహితులందరూ పారిపోయారు. శుక్రవారం తెల్లవారు ఝామున మూడు గంటల ప్రాంతంలో అల్కాపురి రోడ్ నెంబర్ 30. ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఓ అపార్టుమెంట్ ముందు తీవ్ర రక్తస్రావంతో పడి ఉన్న యువకుడిని స్థానికులు గుర్తించి 100.కు ఫోన్ చేసి సమాచారం అందించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని కొన ఊపిరితో ఉన్న యువకుడిని చికిత్స నిమిత్తం 108లో ఉస్మానియాకు తరలించారు. చికిత్స పొందుతూ రోహిత్ మృతి చెందాడు. మృతుడిపై పదునైన ఆయుధంతో దాడి చేయడం, నిర్మాణంలో ఉన్న అపార్టుమెంట్‌కు తీసుకు రావడంను పరిశీలిస్తే ముందస్తుగా వేసుకున్న పథకం ప్రకారమే రోహిత్‌ను అక్కడికి పిలిపించి దాడి చేశారని పోలీసులు అనుమానిస్తున్నారు. పుట్టిన రోజు జరుపుకున్న అక్బర్‌ను మరో యువకుడిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు నార్సింగి పోలీసులు వివరించారు.

## మా అధికారులపై విపరీతమైన ఒత్తిడి

### -ఆక్రమణలపై సిపి.సివి ఆనంద్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, నవంబరు 15 ప్రభాతవార్త** నగరంలో సైకిల్ ట్రాక్ లు, ఫుట్ పాత్‌ల ఆక్రమణలపై సిటీ సీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు చేశారు. సైకిల్ ట్రాక్ లు, ఫుట్ పాత్‌ల ఆక్రమణలు మాఫియా తరహా చర్య అన్నారు. దీని వల్ల ట్రాఫిక్‌పై ప్రతికూల ప్రభావం పడుతోందని అందువల్ల ఆపరేషన్ రోప్ ను సీరియస్ గా చేపట్టాలని తాను అధికారులకు సూచించానన్నారు. ప్రధానంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు తమ వస్తువులను అమ్ముకుని జీవనం గడిపేందుకు సైకిల్ ట్రాక్ లు ఫుట్ పాత్ లను నిర్దాక్షిణ్యంగా ఆక్రమించుకుంటున్నారని ఇటువంటి వాటిలో పేదరికం, జీవనోపాధి అంశాలను తీసుకురావొద్దని కోరారు. వీటిని క్లియర్ చేసే సమయంలో మా అధికారులు ప్రతి రోజు విపరీతమైన ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని అందువల్ల అధికారులకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎక్స్ వేదికగా ఓ నెటిజన్ చేసిన పోస్టుకు చిలకలగూడ ట్రాఫిక్ పీఎస్ స్పందనపై సీవీ ఆనంద్ పై విధంగా స్పందించారు. కాగా ఆలుగడ్డ భావి నుంచి మెట్టుగూడ వెళ్లే మార్గంలో ఎడమవైపున కూరగాయల వ్యాపారులు, నర్సరీలు రోడ్డును ఆక్రమించుకుంటున్నారని వీటిపై చర్యలు తీసుకోవాలని ఓ నెటిజన్ చేసిన పోస్టుకు చిలకలగూడ ట్రాఫిక్ పీఎస్ స్పందించింది. తాము క్రమం తప్పకుండా ఆపరేషన్ రోప్ నిర్వహిస్తున్నామని, నిబంధనలకు విరుద్ధమైన వాటిని తొలగించి చలాన్లు వేస్తున్నామని చెప్పారు. ట్రాఫిక్ పోలీసుల చర్యను సీవీ ఆనంద్ ప్రశంసించారు. మీ పనిని కొనసాగించాలని మరియు ఆ ప్రాంతాన్ని క్లీన్ గా ఉంచేందుకు అవసరమైన చోట జీహెచ్‌ఎంసీ సహాయం తీసుకోవాలని సూచించారు. ఆపరేషన్ రోప్ ను తొలుత చార్మినార్ ప్రాంతంలో ప్రారంభించాలని, అక్కడ హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విజయం సాధిస్తారా లేదో చూడాలని ఆ తర్వాత మరో ప్రాంతంలో విస్తరించాలని ఓ నెటిజన్ చేసిన కామెంట్ కు సీవీ ఆనంద్ సెటైరికల్ రిప్లై ఇచ్చారు. ఇదిగో! ప్రతి దానిలో ఆ కోణాన్ని తీసుకురండి అంటూ రిప్లై ఇచ్చారు. అలాగే ఇతర నెటిజన్ల కామెంట్లపై స్పందిస్తూ.. మాకు చాలా పరిమిత సిబ్బంది, వనరులు, క్రేన్లు ఉన్నాయని అయినప్పటికీ మేము మా వంతు కృషి చేస్తున్నామన్నారు.

## గుర్తు తెలియని మహిళ హత్య..?

**దుండిగల్, నవంబర్ 15 ప్రభాతవార్త:** నిర్మానుష్య ప్రదేశంలో శరీరంపై గాయాలతో ఓ గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..దుండిగల్ మున్సిపాలిటీ, బహదూర్‌పల్లి పరిధి కాకతీయ లేఅవుట్2లో ప్రీకాస్ట్ కాంపౌండ్ వాల్ నిర్మించిన ఒక ప్లాటులో మహిళ పడిపోయి ఉందని గురువారం రాత్రి పోలీసులకు సమాచారం అందడంతో ఘటనా స్థలికి చేరుకున్నారు. శరీరంపై గాయాలతో పడిపోయి ఉన్న మహిళ వద్దకు వెళ్ళి పరిశీలించగా విగత జీవిగా ఉంది. తల వెనుక భాగం, చెవి భాగాల్లో గాయాలతో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. మృతురాలు సుమారు 40-45 మధ్య వయసు ఉంటుందని, చిలకపచ్చ రంగు చీర, బ్లౌజ్ ధరించి ఉందని, రెండు చేతులపైన పువ్వు గుర్తుతో పచ్చబొట్లు ఉన్నాయన్నారు. మృతురాలికి సంబంధించిన ఏలాంటి ఆధారాలు లభించలేదన్నారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. గుర్తు తెలియని మహిళా మృతిగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా నిర్మానుష్య ప్రదేశం, మృతురాలు శరీరంపై గాయాలు, తీవ్ర రక్త స్రావం, ఆధారాలు లేకపోవడం చూస్తే పలు అనుమానాలు రేకెత్తుతు న్నాయి. జనసంచారం లేని ప్రదేశంలో కావడంతో ఎవరైనా ఆమెను ఇక్కడి తీసుకువచ్చి హత్య చేసి ఉండవచ్చునానే అభిప్రాయాలు వెలువడుతున్నాయి.

## ఐటి కారిడార్‌లో వాహనాల మీద వెళ్లే వారి వద్ద దోపిడీలు

### -నిందితుడి అరెస్టు, పరారీలో మరో నిందితుడు




వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ ఏసిపి శ్రీకాంత్

**గచ్చిబౌలి, నవంబరు 15 ప్రభాతవార్త** ఐటి కారిడార్‌లో వాహనాల మీద వెళ్తున్న ప్రయాణికులను అడ్డగించి, కత్తితో బెదిరించి దోపిడీలకు పాల్పడుతున్న ఓ నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ ఏసిపి శ్రీకాంత్ వెల్లడించారు... గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలో ఐటి ఉద్యోగులుగా పనిచేస్తున్న సెనగల ప్రశాంత్, జాహ్నవీలు ఈనెల 5వ తేదీన అర్థరాత్రి 2 గంటల ప్రాంతంలో ద్విచక్రవాహనం మీద గచ్చిబౌలి నుంచి లింగంపల్లి వైపు వస్తున్నారు. ఈక్రమంలో గచ్చిబౌలి టిసిఎస్ వద్ద నెంబర్ ప్లేట్ లేని ద్విచక్రవాహనం మీద వచ్చిన ఇద్దరు వ్యక్తులు వీరి వాహనాన్ని అడ్డగించారు. మొదట మీరు యాక్సిడెంట్ చేశారంటూ బయపెట్టేందుకు ప్రయత్నించిన ఇద్దరు గుర్తు తెలియని నిందితులు ప్రశాంత్, జాహ్నవీలను కత్తితో బెదిరించి వారి వద్ద నుంచి సిల్వర్ ఆభరణాలు, చెవి రింగులు, సెల్‌ఫోన్లను దోపిడీ చేసి అక్కడి నుంచి ఉడాయించారు. ఈ విషయమై బాధితులు అదే రోజు గచ్చిబౌలి పోలీసులకు పిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. కాగా శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టిన పోలీసులకు ఓ వ్యక్తి అనుమానస్పదంగా కనిపించగా, అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే అక్కడి నుంచి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకొని విచారించగా, పహడీషరీఫ్‌కు చెందిన సయ్యద్ జుబేర్ అలీ(20)గా గుర్తించారు. జుబేర్ ప్రయాణించిన స్కూటీ వాహనాన్ని తనిఖీ చేయాగా, అందులో ప్రశాంత్, జాహ్నవీల సెల్‌ఫోన్లు లభించాయి. దీంతో నిందితుడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా, ప్రశాంత్, జాహ్నవీలను బెదిరించి దోపిడీ చేసిన విషయాన్ని అంగీకరించాడు. మరో నిందితుడితో కలిసి నెంబర్ ప్లేట్ లేని బైక్ మీద వచ్చి ఈ దోపిడీకి పాల్పడినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. దీంతో నిందితుడి వద్ద నుంచి దోపిడీ కోసం ఉపయోగించిన ద్విచక్రవాహనం, బాధితుల వద్ద చోరీ చేసిన ఆభరణాలు, సెల్‌ఫోన్లు, 25వేల నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. జుబేర్‌తో పాటు ఈ దోపిడీలో పాల్గొన్న మరో నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. కాగా విచారణలో నిందితుడు జుబేర్ గతంలో అత్తాపూర్, కాచిగూడ, అబీడ్స్, అఫ్జల్‌గంజ్, చత్రీనాక పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు.

